

ఆత్మకూరులో ఆదివారం పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు తదితరులు

ఆగిన అభివృద్ధిని పట్టాలెక్కించాం

- టిడ్కో గృహసముదాయల్లో రామాలయాల నిర్మాణం
- ఎన్డీఏ ప్రభుత్వం బీసీల ప్రభుత్వం
- వైసీపీ పాలనలో కుంటుపడిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నాం
- జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ. 37 వేల కోట్లు
- ఆత్మకూరులో రాష్ట్ర మంత్రుల వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మకూరులో ఆగిపోయిన అభివృద్ధిని పట్టాలెక్కించాం.. ఉమ్మడి ఏపీలో జరిగిన అభివృద్ధిని ఒక్క శాతం కూడా వైసీపీ ఎమ్మెల్యేలు ముందుకు తీసుకెళ్లలేకపోయారు. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సోమశిల అభివృద్ధికి తట్టెడు మట్టి వేయలేదు. యువగళం పాదయాత్రలో ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టాలెక్కిస్తామని హామీ ఇచ్చాం. ఆత్మకూరు అభివృద్ధిలో రాష్ట్రమంత్రులు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది. ఎన్డీఏ ప్రభుత్వం బీసీల ప్రభుత్వం. జిల్లాలో రోడ్ల నిర్మాణం కోసం రూ. 37 వేల కోట్లు కేటాయించాం'.. అని ఆదివారం ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, సవిత, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

దేవదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగ్గా, ఐదుగురు రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతి నిధులు, జిల్లా ఉన్నతాధికారులు తరలి వచ్చారు. వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ముందుగా ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సోమశిల జలాశయం అభివృద్ధికి తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. ప్రాజెక్టు పరిస్థితి అయోమయంగా మారినా పట్టించుకోలేదని విమర్శించారు. అమృత్ పథకం కింద ఆత్మకూరుకి రూ. 10 కోట్లు ఇస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్రం నుంచి హౌసింగ్ నిధుల కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏఎస్‌పేట దర్గా అభివృద్ధికి వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ నిధులు ఇస్తామని తెలిపారన్నారు. ఇలా ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో రాష్ట్ర మంత్రులు, ఎంపీ, పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఆనం తెలిపారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు రూ. 36 వేల కోట్లు కేటాయించి, బీసీల పక్షపాతిగా నిలిచిందన్నారు. పాఠశాలల్లో పేరుకుపోయిన డైట్ బిల్లుల బకాయిలను సరిచేస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి అన్ని హాస్టళ్లలోని విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెట్టాలని మంత్రి నారా లోకేష్ భావిస్తున్నారని ఆమె వెల్లడించారు.

ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ. 37 వేల కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని 27 వేల కి.మీ రోడ్లలో బైకులు కూడా తిరిగే పరిస్థితి కూడా లేదని, వాటిన్నంటిని పునర్ నిర్మిస్తామని తెలిపారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఛైర్మన్ కేశవచౌదరి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ. 37 వేల కోట్లు

టిడ్కో ఇళ్ల సముదాయల్లో రామాలయాల నిర్మాణం

మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 67 ప్రాంతాల్లో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద రామాలయాల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ఇందులో మొదటిగా ఆత్మకూరులో శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. జగన్ ప్రభుత్వ అసమర్థత వల్ల స్వచ్ఛభారత్, అమృత్ పథకాల నిధులు వెనక్కి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ నియోజకవర్గాలను ఎమ్మెల్యేలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నదని ఆయన పేర్కొన్నారు.

పేదలకో సువర్ణావకాశం

- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా
- ఆక్రమిత స్థలాల రెగ్యులరైజేషన్‌కు ఆదేశాలు

- 150 గజాల్లోపు ఇల్లుంటే ఉచితంగా పట్టా
- 150 నుంచి 300 గజాల్లోపు 15 శాతం ఫీజుతో డీడ్
- 2019 అక్టోబరు 15 వరకు కటాఫ్‌గా నిర్ణయం
- ఈఏడాది చివరివరకు దరఖాస్తుకు అవకాశం

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆ ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు పేదలకు పట్టాలు అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విధివిధానాలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 అక్టోబరు 15 నాటికి ఎవరైతే అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారో.. అలాంటి వారందరినీ అర్హులుగా చేరుస్తూ జీవో విడుదల చేసింది. పేదలకు ఉచితంగా పట్టాలు ఇవ్వడమే కాక, ఇతరులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొని ఉన్నా, వారికి నిర్దీతధర ప్రకారం కన్వేయన్స్ డీడ్ ద్వారా హక్కులు కల్పించేందుకు కూడా అవకాశం ఇచ్చింది. ఈ నిర్ణయంతో జిల్లాలో వేలాదిమంది పేదలకు ఇళ్ల పట్టాలు దక్కనున్నాయి. అలానే ఇతరులకు కూడా వారి ఇళ్లపై అధికారిక హక్కులు రానున్నాయి. ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు ఈ ఏడాది ఆఖరువరకూ సమయమిచ్చారు. అప్పట్లోగా సచివాలయాల ద్వారా అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే మహిళల పేరిట మాత్రమే పట్టాలు మంజూరు చేస్తారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా ఈ స్కీం కింద పరిగణలోకి తీసుకుంటారు. ముందుగా తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాసులు పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే డివిజనల్ స్థాయి కమిటీకి పంపుతారు. అక్కడ పరిశీలించి అర్హుల జాబితా ప్రకటిస్తారు. ఇలా అప్రూవల్ అయిన వెంటనే ఆ జాబితాను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు పంపుతారు.

నిబంధనలు ఇవి...

● అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మాత్రమే ఈ రెగ్యులరైజేషన్ పథకం వర్తిస్తుంది. లేఅవుట్‌లో ఓపెన్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ ప్రాంతాలు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లోని నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన ఇతర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే అలాంటి వాటిని క్రమబద్ధీకరించరు.

● పేదలకు 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. వీరు రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, 150 నుంచి 300 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉంటే అలాంటి వారు భూమి బేసిక్ ధరలో 15 శాతం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం భరించాలి. ఈ కేటగిరిలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

● 300 నుంచి 450 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉన్న బీపీఎల్ కుటుంబాలు భూమి విలువలో వంద శాతం చెల్లించడంతోపాటు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాలి. అదే ఉన్నత వర్గాలకు చెందినవారు భూమి విలువలో 200 శాతం చెల్లించడంతోపాటు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజును భరించాల్సి ఉంటుంది. ఇక 450 గజాలకు మించి ఎవరు ఆక్రమణలో ఉన్నా బేసిక్ ధరకు ఐదు రెట్లు చెల్లించడంతో పాటు వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాలి.

● ఆక్రమించుకుని ఖాళీగా ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించరు. కనీసం రేకుల ఇళ్లయినా ఆ స్థలంలో ఉండాలి. అది కూడా 2019 అక్టోబరు 15కు ముందు నుంచే ఉండాలి. ఇందుకు ఆధారంగా ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు, నీటి పన్ను వంటి వాటిని పరి గణలోకి తీసుకుంటారు. ఇంతకుముందు క్రమబద్ధీకరణ పథకం కింద లబ్ధి పొందిన వారికి ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. క్రమబద్ధీకరించుకున్న రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారు.



నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లాలో 121 కేంద్రాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు,పాల్గొన్న ఇతర అధికారులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం (నేటి) నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇందుకుగాను అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 121 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరపనున్నారు. ఈనెల ఐదోతేదీ నుంచి ఒకేషనల్ విద్యార్థులకు ప్రారంభమైన ప్రాక్టికల్స్ ఈనెల 20వతేదీ వరకు మూడో దశల్లో జరగనున్నాయి. జనరల్ సైన్స్ విద్యార్థులకు సోమవారం (ఈనెల 10) నుంచి రెండు దశల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. జనరల్ సైన్స్‌లో ఎంపీసీకి 19,684 మంది, బైపీసీకి 3,823 మంది కలిపి మొత్తం 23.507 మంది ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారు. జనరల్ విద్యార్థులకు ఈనెల 10 నుంచి 14వతేదీ వరకు మొదటి దశ, 15 నుంచి 19వతేదీ రెండోదశలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. నెల్లూరులోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు వివరాలను వెల్లడించారు.

● **సీసీ కెమెరాల పర్యవేక్షణ**

నాన్‌జంబ్లింగ్ విధానంలో, సెల్ఫ్ సెంటర్లలో జరిగే ప్రాక్టికల్స్‌లో కార్పొరేట్‌లకు కళ్లెం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అవకతవకలు జరిగినా, ల్యాబ్‌ల నిర్వహణ సరిగా లేకున్నా కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని ఆర్ఐవో హెచ్చరించారు. పరీక్షల పేరుతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల వద్ద నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతూ, వాస్తవాలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత యాజమాన్యాలపై ప్రత్యేక దృష్టిసారించి, బోర్డు నిబంధనలకు అనుగుణంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఎలాంటి వదంతులు నమ్మకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు. అలాగే ఈ ఏడాది ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే ఎప్పటికప్పుడు మార్కులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్య, రవాణా, విద్యుత్, పోస్టల్, మునిసిపల్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సమ న్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి, పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

● **నిరంతర పర్యవేక్షణ**

ఈ పరీక్షలకు 400 మంది ఎగ్జామినర్‌లు, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీలను నియమించామని, వీరు నిరంతరం పరీక్షలను పర్యవేక్షించడంతోపాటు అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటారని ఆర్ఐవో తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష సమయానికి అరగంట ముందు మాత్రమే ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉన్నందున లీకేజీకి ఎలాంటి అవకాశం ఉండదన్నారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఏరోజుకు ఆరోజు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తా మన్నారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి పరీక్షలకు సిద్ధం చేసినందున ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల న్నారు. హాల్‌టికెట్ అందని వారు ఇంటర్‌బోర్డు వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదైనా సమస్య లుంటే 0861-2320312 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.

● **నిర్వహణకు కమిటీ**

ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)ని నియమించారు. ఆర్ఐవో కన్వీనర్‌గా, సభ్యులుగా ప్రిన్సిపాళ్లు బీడీ.దీనదయాళ్, పీ. వేణుగోపాల్, అధ్యాపకులు కే.కొండయ్య, సీహెచ్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రాక్టికల్స్ ఆయా కళాశాలల్లోని ల్యాబ్‌ల్లోనే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రాక్టికల్స్ జరిగే కళాశాలల్లోని ల్యాబ్‌లను పరిశీలించారు. సమస్యలున్న ప్రాంతాల్లో వెంటనే సరిదిద్ది సరైన పద్ధతిలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసి ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఆర్ఐవో ఆదేశాలు జారీ చేశారు.

ఏయే పోస్టులు ఎవరెవరికి ?

- నామినేటెడ్ పదవుల జాబితా ఇవ్వాలని ఫరూక్ సూచన
- కొన్నింటి విషయమై వాడివేడిగా చర్చ
- బీసీ భవన్ నిర్మాణానికి ఆమోదం
- పార్టీ కొత్త కార్యాలయ నిర్మాణానికి నిర్ణయం
- టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు



నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఫరూక్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ఇంటూరి, పార్టీ నేత బీద రవిచంద్ర

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు చేశారు. ప్రధానంగా నామినేటెడ్ పదవులపై వాడివేడి చర్చ జరిగింది. టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి ముఖ్య నేతలంతా హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతోపాటు పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు సమావేశం జరిగింది. జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను ఏయే నియోజకవర్గానికి కేటాయించాలి..? అన్న దానిపై చర్చించా రు. ఈ సందర్భంగా ముఖ్యులంతా తమ తమ అభిప్రాయాలు చెప్పారు.

● **జీపీ, ఏజీపీ, ఏపీపీల నియామకంపై చర్చ**

జిల్లా గవర్నమెంట్ ప్లీడర్(జీపీ)గా శ్రీహరినారాయణరావును నియమిస్తూ ప్రభుత్వం గత నెలలోనే జీవో ఇచ్చింది. అయితే దీనిపై అభ్యంతరం చెప్పిన కొందరు ముఖ్యనేతలు ఆ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈ విషయమై ముందుగా చర్చ జరగ్గా నెల్లూరుకు చెందిన మరో లీగల్ సెల్ నాయకుడిని జీపీగా నియమించాలని కొందరు ప్రతిపాదించారు. అయితే సీఎం ఆమోదించిన తర్వాత నియామకమైన శ్రీహరినారాయణరావును కొనసాగించాలని సోమిరెడ్డి సూచించారు. చివరకు జీపీని కొనసాగిస్తూ నెల్లూరుకు చెందిన లీగల్‌సెల్ నాయకుడిని ఏజీపీగా నియమించాలని నిర్ణయించారు. రెండేళ్ల తర్వాత అతడికి జీపీగా అవకాశం ఇవ్వాలని తీర్మానించారు. ఇక ఏపీపీల నియా మకంపైన కూడా చర్చించారు. పార్టీ కోసం పనిచేసిన పలువురికి అవకాశం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

● **కొత్త కార్యాలయ నిర్మాణానికి నిర్ణయం**

నెల్లూరులో కొత్తగా టీడీపీ కార్యాలయం నిర్మించాలని తీర్మానించారు. ఎకరా స్థలంలో నిర్మించాలని, అందుకు అవసరమైన భూమిని కొనుగోలు చేయడమా.. లేక ప్రభుత్వం నుంచి లీజుకు తీసు కోవడమా...? అన్నది పరిశీలించాలని నిర్ణయించారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చిస్తామని మంత్రులు చెప్పారు. విలీనం కారణంగా కొన్ని పాఠశాలలు మూతపడే అవకాశాలున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునే లా అధికారులకు సూచించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక దగదర్తి ఎయిర్ పోర్టు నిర్మాణంపై కూడా చర్చ జరిగింది. కాగా సమన్వయ కమిటీ సమావేశం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా ఆర్ అండ్‌బీ అతిథి గృహానికి చేరుకొని కలెక్టర్ ఓ ఆనంద్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఇక్కడ కూడా ఎయిర్‌పోర్టుపై చర్చించారు. సమావేశం నుంచే కేంద్ర పౌరవిమానయాన మంత్రి కే రామ్మోహన్‌నాయుడుతో మంత్రి నారాయణ ఫోన్లో మాట్లాడారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే కమిటీని పంపి పనులు మొదలు పెట్టే అవకాశాలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఇకపోతే బిట్రగుంటలో రైల్వే స్థలాల అభివృద్ధి, రిలయన్స్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

● **ఏ పోస్టు ఏ నియోజకవర్గానికి.. ?**

ఇకపోతే జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పోస్టును నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి, సహకార బ్యాంక్ ఛైర్మన్ పోస్టును కావలి నియోజకవర్గానికి ఇవ్వాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిసింది. ఇక మిగిలిన పోస్టులకు కూడా అర్హులైన వారి జాబితాను అందించాలని ఎమ్మెల్యేలను ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ కోరారు. నుడాకు డైరెక్టర్లను నియమించే అంశమూ చర్చకు రాగా, ఇప్పటికైతే డైరెక్టర్ల నియామకం అవసరం లేదని, ఆ అంశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణానికి గతంలో శిలాఫలకం వేశామని, దాన్ని వైసీపీ హయాంలో పగలగొట్టిన విషయాన్ని బీద రవిచంద్ర ప్రస్తావించారు. ఆ శిలాఫలకాన్ని పునర్‌నిర్మించి, వెంటనే బీసీ భవన్ నిర్మాణం చేపట్టాలని ఆయన కోరగా సమావేశంలో ఆమోదించారు.

నులిపేస్తేనే ఎదుగుదల

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనత, పౌష్టికాహార లోపంతో ఎందరో చిన్నారులు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వయసుకు తగ్గట్లు ఎదుగుదల లేకపోవడం, మానసిక సమస్యలు, చదువుపై శ్రద్ధ చూపలేకపోవటం వంటి సమస్యలు విద్యార్థులను పట్టి పీడిస్తున్నాయి. వీటికి ప్రధాన కారణం నులిపురుగుల సమస్యేనని వైద్యులు చెబుతున్నారు. నులిపురుగులను నిర్మూలిస్తేనే బాలబాలికల్లో ఎదుగుదల సాఫీగా సాగుతుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు సార్లు జాతీయ నులిపురుగుల నివారణ(డీవార్మింగ్) కార్యక్ర మం చేపడుతోంది. ఈ ఏడాదికిగాను సోమవారం డీవార్మింగ్ కార్యక్రమం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులతో నులిపురుగుల నివారణకు అల్ బెండాజోల్ మాత్రలు మింగించనున్నారు.

1 నుంచి 19 ఏళ్లలోపు వారికి..

పిల్లల్లో నులిపురుగుల నివారణకు ముమ్మర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య తీవ్రంగా ఉందని తెలియ చేసింది. దీని కారణంగా వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తి విద్యా ప్రమాణాలు కుంటుప డుతున్నాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఒకే మాత్రతో ఈ సమస్యలన్నింటినీ తొలగించి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రపంచ దేశాలకు సూచించింది. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో నులి పురుగుల నివారణకు చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని 19 ఏళ్లలోపు పిల్లలతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు విద్యార్థులతో మాత్రలు మింగిస్తారు.



- చిన్నారులను వేధిస్తున్న నులిపురుగుల సమస్య
- రక్తహీనత, పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు
- తరచూ అనారోగ్యంతో బడికి దూరం
- అల్‌బెండజోల్ మాత్రతో నివారణ
- ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పంపిణీ
- జిల్లాలో 5.75 లక్షల మంది విద్యార్థుల గుర్తింపు
- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

ప్రభుత్వ పాఠశాలలు	- 2,600
ప్రైవేటు స్కూళ్లు	- 811
అంగన్‌వాడీ కేంద్రాలు	- 2,933
ప్రభుత్వ కళాశాలలు	- 60
ప్రైవేటు కళాశాలలు	- 140
మొత్తం విద్యార్థులు	- 5.75,806



వ్యాధి లక్షణాలు

- కడుపు ఉబ్బరం, తీవ్రమైన కడుపునొప్పి
- అతిసార వ్యాధికి గురి కావడం
- శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గిపోవడం
- రక్తహీనతతో బక్కపలచగా మారడం
- కొద్దిగా శ్రమిస్తేనే తీవ్రమైన అలసట ఏర్పడటం
- జ్వరం, ఆకలి లేకపోవడం

మాత్రలు ఇలా తీసుకోవాలి

- 500 మిల్లీగ్రాముల మెబెండజోల్ మాత్రను నిబంధనల ప్రకారం నమిలి మింగాలి
- ఈ మందును దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు ఇవ్వరాదు
- గుండెజబ్బు, మూర్ఛరోగం, కాలేయ వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు ఇవ్వరాదు
- పరగడపున ఈ మాత్రలు మింగించరాదు
- భోజనం చేసిన తరువాతే మింగించాలి.
- ఈ మాత్రలు మింగినప్పుడు ఏవైనా దుష్పరిణామాలు వెలుగు చూస్తే వెంటనే ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలి.

నివారణ చర్యలు..

- వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి
- నిత్యం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి
- భోజనం ముందు, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- ఆరుబయట ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదు.
- బహిర్భూమికి వెళ్లినప్పుడు చెప్పులు తప్పక వాడాలి.
- క్రమం తప్పకుండా గోళ్లు కత్తిరించుకోవాలి.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగి తినాలి

విద్యార్థులకు మందులు వేస్తాం

ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేశాము. విద్యార్థులకు మాత్రలు వేసేలా చర్యలు తీసుకున్నాం. రెండేళ్లలోపు చిన్నారులకు అరమాత్రను పొడిచేసి మింగించాలి. మూడు నుంచి 19 ఏళ్ల వారికి ఒక మాత్రను చప్పరించి మింగించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. పిల్లల్లో వ్యాధులకు ప్రధాన కారణం నులిపురుగులే. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఏటా రెండు దఫాలుగా జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం చేపడుతోంది. జిల్లాలో మొత్తం 5.75 లక్షల మంది బాలబాలికలకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మందుల పంపిణీ జరుగుతుంది.

\- డాక్టర్ యశ్వంత్, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం జిల్లా అధికారి



న్యూస్ బాక్స్

సోమశిలలో 64.850 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 1,025 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 64.850 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల తవ్వకాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి): ఉదయగిరి దుర్గం కొండపై గుప్తనిధుల తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుం టున్నారు. శనివారం రాత్రి దుర్గంపై ఫ్లడ్ లైట్ల వెలు గులు కనిపించడంతో గుప్తనిధుల ముఠా సంచ రిస్తున్నట్లు స్థానికులు అను మానం వ్యక్తం చేశారు. గతంలో కూడా దుర్గంపై పలుమార్లు ఓ ముఠా గుప్తనిధుల తవ్వకాలు చేపట్టి ప్రాణా లు సైతం పోగొట్టుకున్న సంఘ టనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరలా గుప్తనిధుల తవ్వకాలు జరుగుతున్నట్లు పట్టణంలో దావనంలా ప్రచారం జరుగుతోంది. పోలీసులు సైతం తవ్వకాలపై ఆరా తీస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు నెల్లూరులోని బీవీ నగర్‌లో మహికర్ సమతేష్, కరుణ దంపతులు నివసిస్తున్నారు. వారికి గతేడాది వివాహమైంది. ఆదివారం చర్చికి వెళుతు న్నానని ఇంట్లో నుంచి బయటకు వచ్చిన కరుణ అదృశ్యమైంది. ఆమె కోసం కుటుంబసభ్యులు గాలించినా ప్రమోజనం లేకపోవడంతో వేదాయ పాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌బైక్ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నందిపాడు సమీపంలో ఆది వారం మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తా పడ్డ సంఘటనలో ఇద్దరు తీవ్రం గా గాయపడ్డారు. వివ రాలు ఇలా ఉన్నాయి. ఉదయ గిరి మండలం జీ.చెరువుపల్లి హరీష్, గోపిలు పనినిమిత్తం నందిపాడుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా నందిపాడు శివా రున మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు గమనించి వారిని 108లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం ఆత్మకూరు తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు ఆదివారం మృతి చెందారు. నెల్లూరు సౌత్‌ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... జిల్లాలోని దగదర్తికి చెందిన శ్రీనివాసులు (55), భాగ్యమ్మ దంపతులు ఈ నెల 6వ తేదీ సుందరయ్య కాలనీలోని బంధువుల ఇంటికి వచ్చారు. శ్రీనివాసులు భార్యను మరుసటి రోజు రమ్మని చెప్పి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఇరగాళమ్మ గుడి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఓ వృద్ధురాలిని బైక్‌తో ఢీకొని శ్రీనివాసులు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని విజయ వైద్యశాలకు అక్కడి నుంచి తిరిగి నెల్లూరు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి శ్రీనివాసులు మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	224
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8183
వెండి కిలో ధర	రూ. 98,300
వెండి ఒక గ్రాము	రూ.101.30



దర్గాలో సమాధిని గమనిస్తున్న స్థానికులు

దర్గా సమాధిలో కదలికలు

- చూసేందుకు ఎగబడ్డ ప్రజలు

అల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అల్లూరులోని 400 ఏళ్ల చరిత్ర కలిగిన దాదా దాదీమా దర్గాలో వింత సంఘటన చోటు చేసుకుంది. శని, ఆదివారం రాత్రి దాదీమా సమాధిలో ఏర్పడిన కదలికలు స్థానికులను ఆశ్చర్యానికి గురిచేశాయి. మానవుడు శ్వాస తీసుకుంటున్నట్లు సుమారు రెండు గంటలకుపైగా కదలికలు ఏర్పడడంతో దాదీమా మహిమ అని స్థానికులు నమ్ముతున్నారు. 2018లో కూడా ఇలా కదలికలు వచ్చినట్లు తెలిపారు. మళ్లీ రెండురోజులుగా ఈ కదలికలు రావడంతో గ్రామస్థులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. గంధమహోత్సవం చేపట్టేందుకు సమయం ఆసన్నమవడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు చర్చించుకుంటున్నారు. ఈ వింతను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

హోరాహోరీగా మహిళా హాకీ

- రాష్ట్ర పోటీల్లో ఫైనల్స్‌కు చేరిన కడప, అనంతపురం జట్లు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం నెల్లూరు, గుంటూరు జట్లు తలపడగా 3-0 తేడాతో నెల్లూరు, అనంతపురం, తిరుపతి జట్ల మధ్య జరిగిన పోటీలో అనంతపురం 1-0 తేడాతో, అనకాపల్లి, నెల్లూరు మధ్య మ్యాచ్‌లో అనకాపల్లి 3-0 తేడాతో విజయం సాధించాయి. విశాఖపట్నం, కర్నూలు జట్ల పోటీలో విశాఖపట్నం 8-0 తేడాతో, సత్యసాయి, శ్రీకాకుళం జిల్లా జట్ల పోటీలో శ్రీకాకుళం 2-1 తేడాతో, ప్రకాశం, ఎన్‌టీఆర్ జిల్లా పోటీలో ప్రశాకం జట్టు 1-0 తేడాతో గెలుపొందాయి. కాకినాడు-సత్యసాయి జిల్లాల పోటీలో కాకినాడ 2-0 గోల్స్‌తో, అనకాపల్లి-గుంటూరు మ్యాచ్‌లో అనకాపల్లి 9-0గోల్స్‌తో, తిరుపతి-ఎన్‌టీఆర్ జిల్లా పోటీలో తిరుపతి 2-0గోల్స్‌తో విజేతలుగా నిలిచాయి. కడప-విశాఖపట్నం పోటీలో కడప 3-0గోల్స్‌తో, కాకినాడ-శ్రీకాకుళం జిల్లాల పోటీలో కాకినాడ 6-0 గోల్స్‌తో విజయం సాధించాయి. అనంతపురం జట్టు ఎన్‌టీఆర్ జిల్లా జట్టుపై 6-0 గోల్స్‌తో, తిరుపతి జట్టు ప్రకాశం జట్టుపై 3-1గోల్స్‌తో, కడప జట్టు కర్నూలుపై 7-0 గోల్స్‌తో జయభేరి మోగించాయి. సాయంత్రం జరిగిన సెమీఫైనల్స్ మొదటి మ్యాచ్



కాకినాడ, కడప జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. కడప జట్టు 5-4 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో మ్యాచ్‌లో అనకాపల్లి, అనంతపురం జట్లు తలపడగా ఈ పోటీ కూడా చివరి వరకు హోరాహోరీగా సాగింది. చివరలో అనంతపురం జట్టు ఆధిక్యత ప్రదర్శించి 3-2 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. సోమవారం మూడవ స్థానం కోసం కాకినాడ- అనకాపల్లి జట్లు తలపడనుండగా, ఫైనల్స్‌లో కడప, అనంతపురం జట్లు ఢీకొననున్నాయి. హాకీ ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను ఆ సంఘం కార్యనిర్వహక కార్యదర్శి పీ థామస్ పీటర్, కార్యదర్శి పీ జగన్మోహన్, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

'కస్తూర్బా'లోకి అర్ధరాత్రి వ్యక్తి ప్రవేశం

- భయంతో కేకలు వేసిన విద్యార్థినులు
- గోడ దూకి ఆ వ్యక్తి పరారీ
- సెలవురోజున తల్లిదండ్రులు రావడంతో విషయం వెలుగులోకి..

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోకి శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించాడు. పాఠశాల వెనుక వైపు గోడ దూకి నిద్ర పోతు న్న విద్యార్థినుల రూంలోకి ప్రవేశించి వారిపై దాడి చేయబోయాడు. గుర్తించిన విద్యార్థినులు పెద్దగా కేకలు వేయడంతో ఆ వ్యక్తి అక్కడ నుండి పరారీ అయ్యాడు. విద్యార్థినులు భయంతో ఏడుస్తుండటంతో అక్కడ పనిచేసే వారు 112నెంబరు ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చా రు. రూరల్ సీఐ రాజే శ్వరరావు ఎస్ఐ బాలక్రిష్ణయ్య, సిబ్బం దిని సంఘటనా స్థలానికి పంపించారు. అక్కడ సీసీ పుటేజ్‌లో వ్యక్తి లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. ఆది వారం సెలవుదినం కావటం తో విద్యార్థినుల తల్లిదం డ్రులు అక్కడకు చేరటంతో వారిని చూసిన పిల్లలు బోరున విలపించటంతో రాత్రి జరిగిన విషయం బయట పడింది. గతంలోనూ ఇలాంటి సంఘటనలు 3సార్లు జరి గినా ప్రిన్సిపాల్ సంధ్యారాణి పట్టిచుకోలేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాలయం చుట్టూ కంప చెట్లు, జగనన్న గృహాలు ఉండటంతో తమ బిడ్డలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. కనీసం ఈ ప్రాంతంలో విద్యుత్ లైట్లు లేవని చెప్పారు. కొందరు తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.

ప్రభుత్వ భూమి కబ్జా

అనంతసాగరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరం చెరువులో కొందరు ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి పొలాలుగా మారుస్తున్నారు. సర్వే నెం 217లో సుమారు 3 ఎకరాల చెరువు భూమికి గతంలో కంచె వేసి చదును చేయడంతో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే శని, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో మళ్లీ ఆ భూమిలో ట్రాక్టర్‌తో చదును చేసి సాగుకు చర్యలు చేపట్టారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సాగుకు చదును చేసిన ప్రభుత్వ భూమి

కోతి చేష్టలతో విరిగిన స్తంభాలు

- ఉలిక్కిపడిన గ్రామస్థులు
- ప్రజలు లేకపోవడంతో తప్పిన ఘోరప్రమాదం

బిట్రగుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథ రావుపేటలో ఆదివారం మాజీ సర్పంచి ఎల్.సురేష్ ఇంటి సమీపంలోని ఐదు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఈ సమయంలో ఆ ప్రదేశంలో జనాలు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం కొన్ని కోతులు విద్యుత్ స్తంభం ఎక్కి తీగలను పట్టుకుని ఊగాయి. ఏళ్ల కిందట వేసిన స్తంభాలు, తీగలు కావడంతో తెగిపడ్డాయి. ఈ విషయాన్ని గ్రామస్థులు లైన్‌మన్ బ్రహ్మయ్యకు సమాచారం ఇచ్చారు. ఆయన విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. అనంతరం రెండు గంటల వ్యవధిలోనే ఒరిగిన విద్యుత్ స్తంభం కిందపడింది. ఆ తర్వాత కాసేపటికి సమీపంలోని మరో మూడు స్తంభాలు విరిగి కిందపడ్డాయి. లైన్‌మెన్ ఈ విషయాన్ని ట్రాన్స్ కో ఏఈ జడరాంకు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన కొత్త విద్యుత్ స్తంభాలను తెప్పించి సాయంత్రానికి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు కూలడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఎవరూలేని పెంకుటింటి ప్రహరీ గోడపై స్తంభం పడటం, ఆ సమయంలో అటువైపు ఎవరు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.



పెంకుటింటిపై పడిన విద్యుత్ స్తంభం

చంపేస్తాడన్న భయంతో హతమార్చారు..

- పాతగొడవలతో యువకుడి హత్య
- బూరతో మొదలై కత్తులకు వెళ్లిన ఘోరం
- పోలీసుల అదుపులో నిందితులు ?

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు ఊదుకునే బూర దగ్గర ప్రారంభమైన గొడవ ఓ వ్యక్తి ప్రాణం తీసే వరకు వచ్చింది. వదలను చంపేస్తాను అన్న మాటలు, ఫాలో చేస్తున్న వ్యక్తులను గమనించి ఎక్కడ తమను చంపేస్తారేమో అన్న భయం అవతలి వ్యక్తిని చంపే స్థాయికి తీసుకెళ్లింది. నెల్లూరులోని ఉడ్‌హౌస్ సంఘంలో శనివారం రాత్రి ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ కేసును గంటల వ్యవధిలోనే పోలీసులు చేధించినట్లు, నిందితులు సైతం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. సేకరించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

నగరంలోని ఉడ్‌హౌస్ సంఘంలో వేళాంగణి, రాజా దంపతులు నివసి స్తున్నారు. వారికి నలుగురు సంతానం. రెండవ కుమారుడు కోడూరు కల్యాణ్ ఉరఫ్ చిన్నా(25) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అతనిపై నవాబుపేట పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉంది. గత నెలలో పెన్నానది తీరాన జరిగిన గొబ్బెమ్మల పండుగకు చిన్నా స్నేహితులతో కలిసి వెళ్లాడు. రంగనాయకుల పేటకు చెందిన జావీద్, జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన అజయ్ అనే వ్యక్తులు కూడా కుటుంబంతో అక్కడికి వచ్చారు. చిన్న, అతని స్నేహితులు కలిసి బూరలు ఊదుతూ శబ్ధం చేస్తుండగా జావీద్, అజయ్ అభ్యంతరం చెప్పారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి గొడవ జరగడంతో చిన్నాపై చేసుకున్నారు. వెంటనే చిన్నా ఫోన్ చేసి స్నేహితులను పిలిపించుకుని అజయ్, జవీద్‌పై దాడి చేశారు. ఈ దాడిలో అజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ గొడవను మనసులో పెట్టుకుని చంపేస్తామని పలుమార్లు చిన్నా బెదిరించడం, అతని మనుషులు తమను ఫాలో చేయడంతో ఎలాగైనా చిన్నాను హతమార్చాలని అజయ్ నిర్ణయించుకున్నా డు. శనివారం రాత్రి తన స్నేహితులు శివ, ఉదయ్‌కిరణ్, అజిత్ అలియాస్ కుల్లా, సురేంద్రతో కలిసి ఉడ్‌హౌస్ సంఘం వెనుక రోడ్డులో ఉన్న చిన్నాపై కత్తులు, కొడవళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి పరారయ్యారు. తీవ్ర గాయాలైన చిన్నాకు అధిక రక్తస్రావం కావడంతో స్నేహితులు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో సీసీ కెమెరాల ఫుటేజ్‌లను ఆదివారం పరిశీలించారు. రెండు బైక్‌లలో ఐదుగురు వచ్చి హత్య చేసినట్లు నిర్ధారించు కున్నారు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ నేరంలో మరికొందరి హస్తం ఉన్నట్లు తెలిసింది. కాగా, చిన్నా మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బద్దెవోలులో ఇరువర్గాల ఘర్షణ

- 8 మందికి గాయాలు

మనుబోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెవోలు దళితవాడలో ఆదివారం ఇరువర్గాల నడుమ జరిగిన ఘర్షణలో 8 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. దళిత వాడలో వారం రోజులుగా పంచా యతీ మంచినీటి కుళాయి పనిచే యడం లేదు. ఈ క్రమంలో దానికి మరమ్మతులు చేసేందుకు పంచా యతీ సిబ్బంది వచ్చారు. అక్కడ కొంతమంది మహిళలు దుస్తులు ఉతుకుతుండడంతో ఓ వర్గం వారు కుళాయి వద్ద దుస్తులు ఉతకడం మానేయాలని, లేదంటే కుళాయికి మరమ్మతులు చేయవద్దని సిబ్బందికి చెప్పారు. అక్కడే ఉన్న మరో వర్గం వారు కుళాయి లేకుండా డమ్మీ వేయాలన్నారని అనుకుని వారితో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య చిన్నపాటి గొడవ చినికి చినికి ఘర్షణకు దారి తీసింది. మహిళలు, పురుషులు కలిసి కర్రలతో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడులలో ఓ వర్గానికి చెందిన ఇంగిలాల కిరణ్, మల్లపు మమత, ఇంగిలాల సురేష్, ఇంగిలాల శాంతి, ఇంగిలాల రాజేష్‌లు, మరో వర్గంకు చెందిన అడపాల ధనుంజయ, అడ పాల శ్రీనువాసులు, అడపాల రమ్యలు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహ నాల్లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.



గాయపడిన ఇంగిలాల కిరణ్

న్యూస్ బాక్స్

ప్రభుత్వ డెయిరీలకు పాలు పోయాలి



పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ రంగ సంస్థల్లోని డెయిరీలకు మాత్రమే పాలు పోయాలని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నార్తుమోపూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో ఆదివారం రాత్రి పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సహకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీవార్మింగ్‌పై అవగాహన సదస్సు

లింగసముద్రం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంను జయప్రదం చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 4,265మంది బాల బాలికలకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1,460మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నర్రవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్డీఎస్ పని జరుగుతున్న దృష్ట్యా అన్ని 11కేవీ ఫీడర్స్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రవాణశాఖ అధికారులు

కావలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలకు రక్షణ పొందాలని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, లక్ష్మీబాయ్‌లు తెలిపారు. ఆదివారం వారు ముసునూరు జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీవో సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టామన్నారు.

ఆక్రమణల తొలగించాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల శ్మశానంలో చేపట్టిన ఆక్రమణలను తొలగించి ఆ స్థలంను వారికి అప్పగించాలని ఉలవపాడు సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ ప్రభుత్వ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీలో బడ్జట్‌పై ప్రచార ఉద్యమంలో భాగంగా ఆయన గిరిజనులతో సమావేశం అయినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల కిత్రం ప్రభుత్వం గిరిజనులకు ఈ స్థలం కేటాయించగా కొందరు రైతులు ఇటీవల కాలంలో జామాయిల్ మొక్కలు వేసి ఆక్రమించుకోవడం విచారకరం అన్నారు.

'దాడి అమానుషం'

ఉలవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాన్ని తొలగించాలని విశాలాంధ్ర బుక్ షాపు యాజమాన్యంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తిరుపతి నగరంలో ఇస్కాన్ పక్కనే ఉన్న టీటీడీ గ్రౌండ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన సమయంలో శనివారం రాత్రి 8గంటల సమయంలో కొందరు హిందూవాదులు పెరియార్ జీవిత చరిత్ర పుస్తకం తొలగించాలని వాగ్వాదం చేస్తూ యాజమాన్యంపై దాడికి పాల్పడటం విచారకరం అన్నారు. ఇది రచన, ప్రగతిశీల భావాలపై దాడిగా జరిగిన దాడిగా భావించారు.

నేతల నివాళి

బిట్రగుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు సీనియర్ టీడీపీ నేత, రైల్వే విశ్రాంత ఉద్యోగి మేకల వెంకటేశ్వర్లు (67) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి ముంతాల వెంకయ్య, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ వెంకటేశ్వర్లు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రైల్వే పెన్షన్ అసోసియేషన్ కార్యదరి గోవిందరాజులు, సభ్యులు, పావని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రభాకర్, నివాళులర్పించారు.

భాస్కరరావుకు నివాళి

కావలి: 26వ వార్డుసౌత్ జనతాపేటకు చెందిన టీచర్ ప్రతాప్ తండ్రి గూడల బాస్కరరావు అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆయన నివా సానికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నకిలీ ఎన్‌వోసీకి రూ.50వేలు..

డీకేటీ పట్టాకు రూ.లక్ష..

- లింగసముద్రంతో పాటు సమీప గ్రామాల వ్యక్తుల తయారీ?
- కార్యదర్శులు, వీఆర్వోల పేరుతో సంతకాల ఫోర్జరీ..
- గుర్తించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారుల దృష్టికి..


లింగసముద్రం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓల పేరుతో కొంతకాలం నుంచి నకిలీ ఎన్‌ఓసీలు కుప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఈ నకిలీ ఎన్‌ఓసీలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ స్టాంపులు వేసి అడిగిన వారికి ఇస్తున్నారు. నాలుగైదు నెలలు ఈ నకిలీ ఎన్‌ఓసీలు వస్తున్నాయి. వీటిని తయారు చేసే వారు లింగసముద్రంతో పాటు సమీపగ్రామాలకు చెందిన వ్యక్తులు తయారు చేస్తున్నట్లుగా తెలిసింది. ముఖ్యంగా లింగసముద్రంలో ఓ ప్రైవేటు బ్యాంకు ఏర్పాటు చేసిన తరువాత ఆ బ్యాంకులో ఇంటిపై రుణం తీసుకొనేందుకు ఈ నకిలీ ఎన్‌ఓసీలు కన్పిస్తున్నాయి.

● ఇందిరమ్మ, ఎన్టీఆర్ గృహాలపై ఇంటి రుణం కోసమే..

ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇందిరమ్మ, ఎన్టీఆర్ పథకాలతో నిర్మించిన ఇంటి స్థలపట్టాలు రిజిస్ట్రేషన్ కావు. వీటితో ప్రైవేటు బ్యాంకులో ఇంటిపై రుణం తీసుకొనేందుకు ఇంటి యజమానులు నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసే వారిని ఆశ్రయిస్తున్నారు. వీరు సదరు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు వాటి సర్వే నంబర్లు వేయకుండా గ్రామకంఠం సర్వే నంబర్లు వేసి, మిగిలిన పత్రాలను కూడా నకిలీవి సృష్టించి, కందుకూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ ఎన్‌ఓసీల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొని సదరు ప్రైవేటు బ్యాంకులో రూ.3 నుంచి రూ.4.50 లక్షల వరకు అధిక వడ్డీలపై రుణం తీసుకుంటున్నారు.

● ఇంటి కొలతలు వేసినందుకు రూ.50 వేలు

అయితే నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసి ఇవ్వడానికి.. ఇంటి కొలతలు వేసేందుకు నకిలీ రాయుళ్లకు రూ.50వేలు, రిజిస్ట్రేషన్ కోసం మరో రూ.20 వేలు నుండి 30 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే వారంరోజుల కిందట ఈ నకిలీ ఎన్‌ఓసీలను ఓ వీఆర్‌ఓ, కార్యదర్శి దృష్టికి రావడంతో వారు ఆ పత్రాలను, అందులోని తమ సంతకాలు, స్టాంపులను చూసి అవాక్కయ్యారు. వెంటనే వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఎవరైనా ఇంటి రిజి స్ట్రేషన్లకు వస్తే తమ దృష్టికి తేవాలని చెప్పినట్లు తెలిసింది.



లింగసముద్రంలో ఇచ్చిన నకిలీ ఎన్‌వోసీ

● డీకేటీ పట్టా తయారీ జోరుగా..

5ఎకరాల డీకే పట్టా ఇస్తే రూ.లక్ష తీసుకుంటున్నారు. మూడునెలల కిందట గుడ్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 10మంది మహిళలకు ఈ నకిలీ డీకే పట్టాలిచ్చి రూ.10లక్షలు తీసుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఇవి నకిలీవని తేలడంతో మోసపోయామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆత్మకూరులో మళ్లీ 'ఆనం' మార్కు అభివృద్ధి



సహపంక్తి భోజనంలో పాల్గొన్న మంత్రి సవిత, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి



ఆత్మకూరు పర్యటనకు వచ్చిన మంత్రులు ఆనం, నారాయణ, ఫరూక్, సవిత, తదితరులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలం తరువాత ఆత్మకూరు మున్సిపాలిటీలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు బీజం పడింది. దేవదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రూ.కోట్ల విలువయిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగ్గా, ఐదుగురు రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు తరలి వచ్చారు. దీంతో పట్టణంలో ఎటూ చూసిన సందడి నెలకొంది. కార్యక్రమాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.వెంకట రమణమ్మతోపాటు ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు
- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాల్లో బిజీ



కందుకూరు: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కళ్లవళ్లలో రూ.27లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు, రూ.4.61లక్షలతో నిర్మించిన గోకులం షెడ్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కళవళ్ల గ్రామ సచివాలయం నుంచి లింగసముద్రం మండలం వీఆర్.కోటకు రూ.2కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కనెక్టివిటి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 15న కందుకూరుకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘనంగా స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ చంద్రమౌళి, పార్టీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం మాదాల రవికుమార్, గొంది నరసింగరావు, పొడపాటి మహేష్, సోమినేని రవీంద్ర, సోమినేని కొండలరావు, మోదపల్లి నారాయణ, వంకాయలపాటి మాల్యాద్రి పాల్గొన్నారు.

నేడు పలు గామాల్లో శుంకుస్థాపనలు

మండలంలోని రోళ్లపాడు. కొండసముద్రం పోకూరు గ్రామాల్లో తారురోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేయనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ చంద్రమౌళి తెలిపారు.

సీఎం ఘన స్వాగతానికి ఏర్పాట్లు

● కందుకూరు: పట్టణంలో ఈ నెల 15న జరుగనున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం కొండముడుసుపాలెంలో సచివాలయం సమీపంలో కేజీటీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా తిరిగి కేజీటీ రోడ్డులోకి ఉన్న ప్రధాన రహదారిని తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు మాదాల రవికుమార్, నరసింగరావు, కోటేశ్వరమ్మ, మహేష్, కొండలరావు పాల్గొన్నారు.

● ఉలవపాడు:కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ నుంచి ఆత్మకూరు పంచాయతీని కలుపుతూ రాజుపాలెంకు వెళ్లే అంతర్గత తారు రోడ్డు(బీటీ) పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.50లక్షల ఉపాధి నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సిమెంటు రోడ్లు, అంతర్గత బీటీ రోడ్ల నిర్మాణంలో రాజీపడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆకాంక్ష మేరకు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన నిధులతో రోడ్లు వేసే అవకాశాలను పరిశీలించాలని పంచాయతీరాజ్ ఏఈ జేవీ రమణమూర్తిని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ నాశం గోవిందమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సత్తెమ్మకు పొంగళ్లు



పూజా సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న మహిళలు

కలువాయి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంట గ్రామస్థులు ఆదివారం గ్రామదేవత సత్తెమ్మకు పాల పొంగళ్లు పెట్టుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, పాడి పంటలతో కళకళలాడాలని కోరుతూ గ్రామదేవతకు ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ. సత్తెమ్మ ఆలయంలో అమ్మవారి ప్రతిమను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలంతా కలసి పూజా సామగ్రిని కొత్త గంపల్లో నెత్తి మీద పెట్టుకుని మేళ తాళాలతో బాణసంచా కాల్చుకుంటూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు. మండలంలోని గ్రామాల భక్తులు దర్శించుకున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు ఆదివారం రాష్ట్ర మంత్రుల సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఒకటవ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, 5వ వార్డు కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, 14వ వార్డు కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రెండవ వార్డు కౌన్సిలర్ శివకోటారెడ్డికి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. వీరిని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పాల్గొన్నారు.



మంత్రుల సమక్షంలో చేరిన కౌన్సిలర్లు

పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ కలయిక



50ఏళ్ల తరువాత కలుసుకున్న విశ్వోదయ పూర్వ విద్యార్థులు

కావలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1974-75 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారకానాద్ చౌదరి ఆధ్వర్యంలో స్నేహితులు కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 60మంది వరకు సమావేశంలో పాల్గొన్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ యోగక్షేమాలను తెలుసుకుంటూ 50 ఏళ్ల నాటి ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు. సమావేశంలో ఆనాటి గురువులను సత్కరించారు. భౌతికంగా లేనివారిని స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గోపాల్‌రెడ్డిలు చొరవ తీసుకుని కృషితో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

మహా కుంభమేళా పవిత్రజలం పంపిణీ



జలాలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు, నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆదివారం పట్టణంలోని హనుమాన్ భజరంగీ సెంటర్, హరిణి ప్రజావైద్యశాల, ఏకలవ్య నగర్ రామాలయం, ఉప్పుచెరువు రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద మహాకుంభ మేళా పవిత్ర అమృతజలాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ప్రతినిధి మల్లికార్జునరావు మాట్లాడారు. కుంభమేళాకు వెళ్లలేని వారు ఈ జలాలను నెత్తిన చల్లుకుంటే మహాకుంభ్‌లో నదీస్నానం చేసిన పుణ్యం దక్కుతుందన్నారు. సోమవారం కూడా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంల గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, మువ్వల భూషయ్య, యు. కొండపనాయుడు, ఉమామహేశ్వరరావు, పొడపాటి చక్రి, వైకుంఠం, చక్కా కేశవ పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలకు మోక్షం ఎప్పుడో..?

- తరగతులు ఐదు.. గదులు రెండు
- అవస్థల నడుమ విద్యాబోధన



అసంపూర్తిగా అదనపు తరగతి గది నిర్మాణం

సంగం, ఫిబ్రవరి 9:మండలంలో అసంపూర్తి నిర్మాణాలతో నిరుపయోగంగా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న భవనాలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అందులో ఒకటి ఈ ఫొటోలో కనిపిస్తున్న భవనం. అసంపూర్తిగా ఉన్న ఈ భవనం మండల కేంద్రం సంగంలోని రాళ్లచెలిక ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గది. పాఠశాలలో ఐదు తరగతులు.. 65 మందికి పైగా విద్యార్థులున్నారు. రెండుగదులు, వరండాలో విద్యా బోధనకు ఇబ్బందిగా ఉంది. దీన్ని గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వంలో అదనపు తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. స్థానిక నాయకుడు భవన నిర్మాణ పనులను చేపటారు. లెంటల్ వరకు పూర్తి చేశారు. బిల్లులు అప్‌లోడ్ చేశారు. నిధుల కొరతతో బిల్లులు మంజూరుకాలేదు. ఇంతలో 2019లో ఎన్నికలు రావడంతో అదనపు తరగతి గది నిర్మాణం ఆగిపోయింది. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ గెలిచింది. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను వైసీపీ నిలిపివేసింది. దీంతో బిల్లులు మంజూరు కాలేదు. వైసీపీ నాడు నేడు పేరుతో కొత్త పాఠశాలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేశారే గానీ అసంపూర్తిగా ఉన్న పనులను పట్టించుకోలేదు. దీంతో టీడీపీ హయాంలో చేపట్టిన అదనపు తరగతి గది నిర్మాణం ఐదేళ్లు అసంపూర్తిగానే మిగిలిపోయింది.

● కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా..

ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టి అర్థాంతరంగా ఆగిపోయి అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణం మొండి గోడలతో ఎక్కిరిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని అధికారులు, పాలకులు చెబుతున్నారు. ఈ క్రమంలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

సంగం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెంలో నెల్లూరు రమణమ్మ అనే వృద్ధురాలికి చెందిన పూర్లిల్లు విద్యాదాఘాతంతో దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. ఆ ఇంట్లో రమణమ్మ ఒక్కటే నివాసం ఉంటుంది. ఆదివారం ఉదయం ఆమె నెల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు ఏర్పడ్డాయి. దీంతో ఇంట్లోని సామాన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న బాధితురాలు తిరిగి ఇంటికి చేరుకుని సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని లబోదిబోమంటుంది. ప్రభుత్వం స్పందించి కట్టుబట్టలతో మిగిలిన వృద్ధురాలిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దగ్ధమైన పూరిల్లు

పాఠశాలకు ఉచితంగా పెయింట్స్

ఉలవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఐదు తరగతి గదులకు సామాజిక సేవలో భాగంగా ఇండిగో పెయింట్స్ కంపెనీ నిర్వాహకులు ఆదివారం రంగులు వేశారు. రూ.1.20లక్షల విలువ చేసే ఈ పెయింట్‌ను మండలంలోని 100 మంది పెయింటర్స్ సహకారంతో ఒక్కరోజులో పూర్తి చేసినట్లు ఇండిగో సంస్థ రాష్ట్ర బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, స్థానిక డీలర్ శ్రీనివాసులు చెప్పారు. ఈ సందర్భంగా వారికి ఎస్ఎంసీ చైర్మన్ వాయల తిరుపతిరావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, శరత్‌లు సంస్థ ఉద్యోగులను శాలువాతో సత్కరించారు.

శాఖాహార ర్యాలీ

వింజమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి కేంద్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ కరుణ పాల్గొన్నారు. విద్యుల్లత మాస్టర్ జన్మదినం సందర్భంగా శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ మండల కేంద్రంలోని పిరమిడ్ నగర్, వైశ్యబజార్, ఎర్రబెల్లిపాలెం వీధుల మీదుగా మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుజిత, హేమలత, రాజేశ్వరి, స్వరాజ్యం, జయప్రద, లక్ష్మీ, హజరత్, జానకిరాంరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు

● బీఎన్‌జీ. ఆజంఖాన్, ఏపీవో

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):అన్నిపంచాయతీల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పనులు కల్పిస్తామని వలసల నివారణకు తమవంతు బాధ్యతగా చర్యలు తీసుకుంటామని ఏపీవో ఆజంఖాన్ తెలిపారు.



? ఉపాధి పనులు జరు గుతున్నాయా.

! 24పంచాయతీల్లో ప్రస్తు తం 18పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. మిగిలిన వాటిల్లోనూ పనులు జరిగేలా సిబ్బందికి సూచనలిచ్చాం.

? సిబ్బంది కొరత ఉందా.

! ప్రస్తుతం 5మంది రెగ్యులర్ ఎఫ్ఏలు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియమిస్తాం.

? లక్ష్య సాధనకు ఏ చర్య తీసుకుంటారు.

! ప్రభుత్వ నిర్దేశాల మేరకు ప్రతిరోజూ 4వేల కూలీలు లక్ష్యం కాగా ప్రస్తుతం 2వేల మంది పనులకు వస్తున్నారు. వ్యవసాయ పనులు సాగుతుండడంతో కూలీల సంఖ్య తగ్గుముఖం పడుతుంది.

? నగదు గిట్టుబాటు అవుతుందా.

! నూతన ప్రభుత్వం రోజువారీ కూలిని రూ.300కు పెంచింది. కూలీలు ఆశించిన మేర పనులు చేయకపోవడంతో సరాసరి రూ.240 వరకు గిట్టుబాటు అవుతుంది.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు, ఆ ప్రాంతవాసులతో కలిసి ఆదివారం స్థానిక ట్యాంక్‌బండ్‌పై కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. గతేడాది వర్షాలు కూడా తక్కువగా కురవడంతో ఇప్పటికే చెరువుల్లో అరకొరగా ఉన్న నీరు అడుగంటి పోతుందన్నారు. సాగు చేసిన పంటలు చేతికందుతాయో లేదోఅన్న ఆందోళన రైతుల్లో నెలకొందన్నారు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి దొరకడం కష్టమే అని వాపోయారు. అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాలకులు, అధికారులు పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అపస్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

● 907 మంది విద్యార్థుల హాజరు



అనంతసాగరం : బహుమతులు అందుకున్న విద్యార్థిని, విద్యార్థులు

అనంతసాగరం ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నిర్వహించిన 10వ తరగతి ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సంగం, ఏఎస్‌పేట, మర్రిపాడు, చేజర్ల, ఆత్మకూరు, కలువాయి మండలాలలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల నుంచి 907 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి టాప్ 10విద్యార్థులను గుర్తించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్‌రెడ్డి, అపస్ రాష్ట్ర నాయకులు చక్రపాణి, రాజగోపాలాచార్యులు, అనిల్‌కుమార్, వెంకయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆది వారం యూటీఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి వెలుగోటి రాములు పాల్గొని ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి శర్మ, బాలరాఘవులు, చెంచలబాబు, వెంకటేశ్వరరెడ్డి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.



వింజమూరు : బహుమతులతో విద్యార్థులు


కనుపూరు చెరువు

● పర్యాటకాభివృద్ధిపై మీనమేషాలు

● కూటమి ప్రభుత్వమైనా శ్రద్ధ చూపేనా?


వెంకటాచలం మండలంలో పర్యాటకాభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకుని ఆదాయ వనరులు పెంపొందించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది. ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా, గొలగమూడి భగవాన్ వెంకయ్య స్వామి ఆలయం, సర్వేపల్లి రిజర్వాయరు, కనుపూరు చెరువు, సైన్స్ మ్యూజియం, కంటేపల్లి సాయిబాబా మందిరం, అడవిలో శివాలయం, జైన్ దేవాలయం ఉన్నాయి. ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి అదనపు ఆదాయం లభించే అవకాశముంది.

అవకాశాలు ఫుల్

అభివృద్ధి నిల్

వెంకటాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కసుమూరులో మస్తాన్‌వలి బతికున్న రోజుల్లో దర్గా సమీపంలో ఉన్న తిప్పపై తిరిగేవాడని స్థల పురాణం చెబుతోంది. ఆయన పడుకున్న ప్రదేశం, కూర్చుని ధ్యానం చేసిన ప్రదేశాలు, ఆయన స్నానం చేసిన షాఫా బావి ప్రాంతాలను దర్గాకు వచ్చిన భక్తులు సందర్శిస్తుంటారు. అయితే ఈ ప్రాంతాలకు వెళ్లడానికి రవాణా సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేసినట్లయితే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. అదేవిధంగా జాతీయ రహదారికి అనుకుని కసుమూరుకు వెళ్లే రోడ్డు పక్కనే కనుపూరు చెరువు ఉంది. ఈ చెరువుకు నీటినందించడానికి తెలుగుగంగ కాలువ కూడా ఉండడంతో ఏడాది పొడవునా నీటిని నిల్వ చేసే అవకాశముంది. ఇందువల్ల ఈ చెరువులో బోటు షికారు, కడప చెట్లను పెంచి పక్షుల రక్షితకేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అంతే కాకుండా చెరువు మధ్యలో చిన్న పాటి దీవిని ఏర్పాటు చేసి ఏదో ఒక భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే జాతీయ రహదారి వెంట ప్రయాణించే వారికి కసుమూరుకు వెళ్లే భక్తులకు ఆకర్షణగా నిలుస్తోంది. అంతే కాకుం డా కనుపూరు చెరువు కట్టను వెడల్పు చేసి చెట్లను పెంచి, బెంచీలను ఏర్పాటు చేస్తే పర్యాటకులకు ఎంతో ఆహ్లాదం లభిస్తోంది. ఏడాది పొడవు నా నీరు నిల్వ ఉండే అతి పెద్ద సర్వేపల్లి రిజర్వాయరును కూడా పర్యాట క కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చు. ప్రముఖ యాత్రా స్థలమైన గొలగ మూడికి, నెల్లూరు నగరానికి సమీపంలో ఈ రిజర్వాయరు ఉండడం వల్ల దీనిని కూడా పర్యాటక పరంగా అభివృద్ధి చేయవచ్చు. అంతే కాకుండా ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గొలగమూడి గ్రామం కూడా భక్తులతో నిత్యం రద్దీ గా ఉంటుంది. వెంకయ్య స్వామి సమాధి మందిరమే కాకుండా ఈ గ్రామంలో దేవాలయాలు అధికంగా ఉన్నాయి. చెముడుగుంట వద్ద జిల్లా సైన్స్ మ్యూజియం ఉంది. ఈ కేంద్రానికి మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే కాకుటూరు వద్ద ప్రసిద్ధి చెందిన మహావీర్ మందిరం, ఆ పక్కనే విక్రమ సింహపురి యూనివర్సిటీ కూడా ఉంది. అంతే కాకుండా గొలగమూడికి వెళ్లే మార్గంలో కంటేపల్లి వద్ద సాయిబాబా మందిరం ఉంది. వెంకటాచలం సమీపంలోనే అడవిలోని శివాలయం ఉంది. అదే రీతిలో మరిన్ని ఆలయాలను ఏర్పాటు చేసి అభివృద్ధి పరిస్తే ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు మంచి ఆదరణ లభిస్తోంది. వీటిని ఈ విధంగా అభివృద్ధి చేయడంలో గత ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కించాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా పర్యాటకాభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతోన్నారు. దీనికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవ తీసుకొని పర్యాటక ప్రాంతాలపై సర్వే జరిపించినట్లయితే ఒక స్పష్టత వస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చేందుతాయి.


కాకుటూరులోని జైన దేవాలయం


గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం


కసుమూరులోని మస్తాన్ వలీ దర్గా

రహదారిపై పడకేసిన మందుబాబు

● గమనించిన కలెక్టర్ ఆనంద్ ● తహసీల్దారుకు సమాచారం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని బుచ్చి, జొన్నవాడ మార్గంలో ఆదివారం ఓ మందుబాబు ఫూటుగా మద్యం సేవించి మత్తులో రహదారిపైనే పడకేశాడు. ఆ మార్గంలో వెళ్తూ గమనించిన కలెక్టర్ ఆనంద్ అతనిని కాపాడాలని తహసీల్దారును ఆదేశించారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, ఏఎస్‌ఐ విశ్వనాథం సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపైన పడకేసిన మందుబాబుని లేపి ఇంటికి పంపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు అభయగణపతి విగ్రహ ప్రతిష్ఠ


గ్రామోత్సవంలో అభయ గణపతి నూతన విగ్రహాలు

మనుబోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరులో సోమవారం అభయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ గ్రామంలో గ్రామస్థులు చందాలు వేసుకుని ఆలయాన్ని నిర్మించారు. రెండు రోజులుగా ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మూలవిరాట్ అభయ గణపతికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం 9-10 గంటల మధ్య మూలవిరాట్ విగ్రహ ప్రతిష్ఠ వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం గణపతి, సిద్ధి, బుద్ధిలకు శాంతి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు..

ఢిల్లీలో బీజేపీ గెలుపుపై బుచ్చిలో విజయోత్సవ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో ఆదివారం బుచ్చిలో కూటమి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం కూడలి నుంచి బస్టాండ్ వరకు బాణా సంచాల పేలుస్తూ మిఠాయిలు పంపిణీ చేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చేవూరు వినయ్‌నారాయణ, కాసా శ్రీనివాసులు, రామిశెట్టి మోహన్‌బాబు, కళ్యాణ్, ప్రత్యూష, మాధవ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

న్యూస్ బాక్స్

ఆక్రమణలకు గురైన చెరువులను కాపాడుకోవాలి

● జనసేన నేత బొబ్బేపల్లి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురైన చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ఈదూరు, కోడూరు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ చెరువుల్లో 1800 ఎకరాల విస్తీర్ణం ఆక్రమణలకు గురైందన్నారు. దీనివల్ల పశువులకు తాగేందుకు నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో పొదలకూరు విద్యార్థిని స్టేట్ ఫస్ట్

పొదలకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కాకులూరు రూపాశ్రీ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్.లక్ష్మీదుర్గ తెలిపారు. ఆదివారం విశ్వం ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో విజయవాడలోని మన కళ్యాణ వేదికలో రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో జూనియర్ అబాకస్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి రూపాశ్రీ ప్రథమ బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని ఆ సంస్థ సీఈవో హరిచరణ్ నుంచి తల్లిదండ్రులతో కలసి అందుకుంది.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ, పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు గాంధీ జీవిత చరిత్రను వివరించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ఎంచుకున్న మార్గంపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పుష్పమాల వేసి నివాళలర్పిస్తున్న ఇంతియాజ్

మహనీయుల అడుగుజాడలే ఆదర్శం

● ఇంతియాజ్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల అడుగుజాడలను ఆదర్శంగా తీసుకుంటున్నానని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చీఫ్ జనరల్ సెక్రటరీ షేక్ ఇంతియాజ్ తెలిపారు. చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం ఆయన నగరంలోని మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్, జాకీర్‌హుస్సేన్ విగ్రహాలకు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు.


ఫ్లైఓవర్‌కు వేసిన పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పెయింటింగ్‌తో ఆహ్లాదం

● మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరును సుందరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు పెయింటింగ్‌లు దోహదపడతాయని రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని రామలింగాపురం ఫ్లైఓవర్ వంతెనకు వేసిన పేయింటింగ్‌లను ఆయన ఆదివారం రాత్రి పరిశీలించారు. రాష్ట్రంలో అన్నీ మున్సిపాలిటీలను మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

నేడు అగస్త్య మహర్షి సాహిత్య సమాలోచన

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం లోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సోమవారం అగస్త్య మహర్షి సాహిత్య సమాలోచన జాతీయ సదస్సు జరుగుతుందని ఆ కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా డాక్టర్ సెల్వం షణ్ముగం, డాక్టర్ గాలి గుణశేఖర్, జీవీ పూర్ణచంద్ర, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, డాక్టర్ పెరుగు రామకృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు.

పాస్టర్ల గౌరవ వేతనాలు విడుదల చేయండి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్స్ గౌరవ వేతనాలకు నిధులు త్వరగా మంజూరు చేయాలని మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్‌కు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉరందూరు సురేంద్రబాబు కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కు ప్రభుత్వం భూమిని కేటాయించి నిర్మించాలని, క్రైస్తవ శ్మశాన వాటికలకు భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

రక్తదానంతో ప్రాణదానం

● రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ జనార్దన్‌రాజు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జనార్దన్‌రాజు అన్నారు. చైతన్యపురి పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పార్కు ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాకర్స్, స్థానికులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్ బాబు, దాత గడ్డం రత్నయ్య, అసోసియేషన్ కార్యదర్శి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మహేష్ నాయుడు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు


మిస్ నెల్లూరు ఆడిషన్స్‌లో ఎంపికైన మహిళలతో ఈవెంట్ ఆర్గనైజర్లు

ఆకట్టుకున్న మిస్ నెల్లూరు ఆడిషన్స్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఓ రెస్టారెంట్‌లో మిస్ నెల్లూరు అందాల పోటీల ఆడిషన్స్ ఆదివారం ఆకట్టుకున్నాయి. 50 మందికిపైగా యువతులు, మహిళలు పాల్గొన్నారు. బ్లోసం బ్లూ ఈవెంట్ ఆర్గనైజర్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆడిషన్స్ జరిగాయి. 30 మందిని ఎంపిక చేశామని, వారికి శిక్షణ ఇచ్చిన తర్వాత మళ్లీ ఆడిషన్స్ నిర్వహించి మిస్ నెల్లూరు విజేతను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 25 కళా సంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ప్రారంభించారు. మిస్ ఇండియా విన్నర్ డాక్టర్ సుప్రజా చౌదరి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అమీర్‌జాన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా అభివృద్ధి పనులు

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ వెల్లడించారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో బీసీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలను బాగా తీర్చిదిద్దారన్నారు. పార్టీ జిల్లా కార్యాలయం చిన్నదిగా ఉందని, నూతన కార్యాలయ నిర్మా ణానికి స్థలం చూస్తున్నామని చెప్పారు. మే నెలలో కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామ నారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కందు కూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్, చిత్రంలో మంత్రులు ఆనం, నారాయణ, అజీజ్, తదితరులు

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీ నగర్‌కు చెందిన వడ్లపట్ల అనుసూయమ్మ(90) ఆదివారం మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. చిరంజీవి ఐబ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సహకారంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

ఆరోగ్యానికి రూ.162 కోట్లు హర్షణీయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట),(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి రూ.162 కోట్లు బడ్జెట్ కేటాయించడం గొప్పవిషయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ అన్నారు. నగరంలోని చిన్నబజారులో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. గుండెపోటు వచ్చిన గంటలోపే ఇవ్వాల్సిన రూ.40 వేల విలువ చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా ఇస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదన్నారు. అన్ని పీహెచ్‌సీలలో ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు హేమంత్, పెంచలయ్య, సుమాన్, శ్రీనివాసులు, సత్య, తదితరులు పాల్గొన్నారు.

దేవరపాళెంలో 'గడప గడపకు..'

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టిన గడప గడప కార్యక్రమంలో ఆదివారం మండలంలోని దేవరపాళెంలో ఆర్భాటంగా జరిగింది. వేదగిరి క్షేత్రం మాజీ ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ నేత హంసరెడ్డిపై కేసు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి9, (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడ కామాక్షితాయి ఆలయానికి చెందిన భూములను ఆక్రమించుకున్న అభియోగంతో ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు మేరకు దేవరపాళేనికి చెందిన వైసీపీ నేత వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డిపై పోలీసు కేసు నమోదైంది. జొన్నవాడ కూడలి వద్ద ఆలయానికి చెందిన భూములను చదును చేసి ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని ఇటీవల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. అప్పుడే భూములను స్వాధీనం చేసుకున్న ఆలయ అధికారులు, కబ్జాకు కారణమైన హంసకుమార్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గుంజి వేణు ఆదివారం తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఆదివారం నగరంలోని వారి నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. రూ.18,39లక్షల విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఇందుకూరుపేట టీడీపీ అధ్యక్షుడు రావెళ్ల వీరేంద్రనాయుడు, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, ఆడపాల శ్రీధర్‌రెడ్డి, జమీర్, ఆవుల వాసు, జహంగీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

● పీఆర్‌టీయూ కార్యదర్శి తిరుమలయ్య

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పీఆర్‌టీ యూ జిల్లా కార్య దర్శి నాటకం తిరుమలయ్య అన్నారు. నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ 54వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై సంఘం పోరాటాలు చేసి విజయం సాధించిందని చెప్పారు. అదే స్ఫూర్తితో ముందు మరిన్ని పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరాజు, నాగిరెడ్డి, శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కామాక్షితాయి సేవలో ఐఏఎస్ అధికారి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారిని ఆదివారం ఐఏఎస్ అధికారి రాము సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనను స్వాగతించారు. అనంతరం వారి గోత్రనామములతో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.



నాయీ బ్రాహ్మణ అధికారులకు సన్మానం

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన అధికారులను ఆదివారం నగరంలోని నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగారావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కల్యాణ మండపం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గత నెలలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ అధికారులుగా ప్రశంసా పత్రాలు పొందిన ఎంపీడీవో మోమిడి శ్రీహరి, కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు వేలూరు రంగారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి సోమవరపు మాల్యాద్రి, ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ గోపాలకృష్ణయ్య తదితరులను సన్మానించారు. ఇటీవల మరణించిన సంఘం సభ్యుడు మంచికలపాటి శ్రీనివాసులు ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, ఆర్ ప్రభాకర్‌రావు, వల్లూరు బాలకేశవులు, ముద్దపాటి రవి తదితరులు పాల్గొన్నారు.


నాయీ బ్రాహ్మణ అధికారులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి కృషి

● జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఆచారి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, అందరూ సహకరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అగర సుబ్రహ్మణ్యం ఆచారి కోరారు. ఆదివారం నగరంలోని కామాటివీధిలో ఉన్న సంతాన బాలగోపాల కృష్ణమందిరంలో ఆ సంఘం మండల కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 38 మండలాల్లో సంఘం కమిటీలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లంపాటి వెంకట రమణయ్య ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేటా విజయాచారి, కోశాధికారి కాపులూరు కృష్ణమూర్తి ఆచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్కేట్ కుమార్ ఆచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పులికొల్లు చిన్నబ్రహ్మయ్య ఆచారి, యువజన అధ్యక్షుడు మాగలనాడు సుమన్‌ఆచారి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో విశ్వబ్రాహ్మణ సేవాసంఘం నాయకులు



వాహనంలో నుంచి నిందితులను తీసుకొస్తున్న పోలీసులు





వీధి లైట్ల వెలుతురులో నిందితులకు గుర్తింపు పరీక్షలు



జడ్జిల నివాస సముదాయం వద్ద పోలీసులు

'సిట్' కార్యాలయంలో

రోజంతా టెన్షన్ టెన్షన్

- పోలీసుల ఉరుకుల పరుగులు
- తమిళనాడు న్యాయవాదుల హడావిడి
- కల్తీ నెయ్యి కేసులో అర్ధరాత్రి రెండు డెయిరీల డైరెక్టర్లు అరెస్టు
- నిందితులకు నడిరోడ్డుపై గుర్తింపు పరీక్షలు

సెప్టెంబరు 18: చంద్రబాబు ప్రకటనతో కలకలం

అక్టోబరు 4: సుప్రీంకోర్టు సిట్ నియామకం

నవంబరు 24: సిట్ సిబ్బంది రాక

డిసెంబరు 13: సిట్ కీలక అధికారుల రాక

ఫిబ్రవరి 9: తొలి అరెస్టులు



భూదేవి కాంప్లెక్సులోని సిట్ కార్యాలయం

తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సుప్రీంకోర్టు నియమించిన సిట్ బృందం కోసం కార్యాలయం ఏర్పాటైన తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులో ఆదివారం ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల డైరెక్టర్లను అరెస్టు చూపించే క్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు తీయడంతో సందడి నెలకొంది. దానికితోడు తమిళనాడు, తిరుపతిలకు చెందిన న్యాయవాదుల హడావిడి కూడా కనిపించింది. కీలక నిందితుల అరెస్టు నేపథ్యంలో సిట్ అధికారులు, సిబ్బంది భోజనాలకు సైతం ఇళ్లకు వెళ్లకుండా కార్యాలయానికే తెప్పించుకున్న పరిస్థితి కనిపించింది. సిట్ బృందానికి కార్యాలయం ఏర్పాటు చేసిన తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులోకి గత నవంబరు 23వ తేదీ నుంచీ ఇతరులను ఎవరినీ అనుమతించడం లేదు. చెక్‌పోస్టు కూడా ఏర్పాటు చేసి సిట్ సిబ్బందిని తప్ప ఇతరుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. దీంతో ఈ ప్రాంతం శనివారం వరకూ ఎలాంటి హడావిడి లేకుండా కనిపించేది. ఆదివారం పరిస్థితి మారింది. ఉదయం నుంచే పోలీసు అధికారులు, సిబ్బంది రాకపోకలు పెరిగాయి. మధ్యాహ్నానికి ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల డైరెక్టర్లను, ఇతర సిబ్బందిని పోలీసులు భూదేవి కాంప్లెక్సుకు తీసుకొచ్చారు. దాంతో ఆయా డెయిరీల అధికారులు, యజమానుల సన్నిహితులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆపై తమిళనాడు, తిరుపతికి చెందిన న్యాయవాదులూ వచ్చారు. నిందితుల అరెస్టు నేపథ్యంలో రిమాండు రిపోర్టు తయారీలో పోలీసు అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు అక్కడే మకాం వేసి స్వయంగా రిమాండు రిపోర్టు రూపొందించారు. రాత్రి 8.20 గంటలకు రిపోర్టు సిద్ధం కావడంతో భారీ బందోబస్తు నడుమ నలుగురు నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించాక 9.10 గంటలకు తిరుపతి రాయలచెరువు రోడ్డులోని జడ్జిల నివాస సముదాయం వద్దకు తరలించారు.

అర్ధరాత్రి రిమాండు

ఆదివారం రాత్రి 11 గంటలకు రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ ఎదుట నిందితులను హాజరుపరచగా వారికి 14 రోజుల పాటు ఆయన రిమాండు విధించారు. అనంతరం 11.30 గంటల సమయంలో నిందితులను పోలీసులు తిరుపతి సబ్ జైలుకు తరలించారు.

నడిరోడ్డుపైనే గుర్తింపు పరీక్షలు

రాత్రి 9.10 గంటలకు నిందితులను జడ్జిల నివాస సముదాయం వద్దకు తీసుకురాగా వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కు చేసి జడ్జి అనుమతి కోసం పోలీసు అధికారులు నిరీక్షిస్తూ గడిపారు. రాత్రి 10.33 గంటలకు దర్యాప్తు అధికారి, అదనపు ఎస్పీ వెంకట్రావు, ఏపీపీ ఇరువురూ అక్కడికి చేరుకున్నారు. 11 గంటలకు జడ్జి ఎదుట నిందితులను హాజరు పరిచారు. అంతకు మునుపు జడ్జిల నివాస సముదాయం ఎదుట రోడ్డుపైనే నిందితులకు పోలీసు అధికారులు గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. ఈఎస్ఐ ఆస్పత్రి గేటు వద్ద వీధి దీపాల కింద నిందితులను నిలబెట్టి గుర్తింపు చిహ్నాలు నమోదు చేశారు.



రిమాండు విధించాక నిందితులను వెలుపలకు తీసుకొస్తున్న పోలీసులు



శ్రీవారి సేవలో శ్రద్ధ

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని, స్వామిని దర్శించుకుని వస్తున్న సినీ నటి శ్రద్ధాశ్రీనాథ్

ఆగని బాంబు
బెదిరింపులు

- తిరుపతిలో మరో రెండు హోటళ్లకు మెయిల్స్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లకు బాంబు బెదిరింపులు ఆగడంలేదు. హర్యామన్ ఐఈడీ బాంబు పేరుతో హోటళ్లు పేల్చేస్తామని, అందరూ బయటకు వెళ్లిపోవాలని బెదిరిస్తూ రీనెస్ట్, పై వైస్రాయ్ హోటళ్లకు ఆదివారం మెయిల్స్ వచ్చాయి. ఆయా హోటళ్ల యజమానుల ఫిర్యాదుతో అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆయా హోటళ్లకు చేరుకున్నారు. పరిసర ప్రాంతాలు, గదులు, వంటగది.. ఇలా అణువణువు తనిఖీలు చేశారు. ఈ మెయిల్స్ అన్నీ కేరళ నుంచి వస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా, రెండు రోజుల కిందట తిరుచానూరు సమీపంలోని గ్రాండ్ రిడ్జ్.. అంతకుముందు తిరుపతి రూరల్ పరిధిలోని వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అలాగే, నాలుగు నెలల కిందట ఈ రెండు హోటళ్లతో పాటు, మరో నాలుగింటికీ బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ప్రతి సారి బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేసి ఎలాంటి బాంబులు లేవని తేల్చేస్తున్నారు.

ఇదంతా ఎవరి పని?

తిరుపతికి వరుస బాంబు బెదిరింపు మెయిల్స్ ఎవరు పంపుతున్నారనేది ప్రశ్నగా మారింది. ఈ మెయిల్ అడ్రస్‌లు ఎవరివి? ఎక్కడ్నుంచి పంపుతున్నారు? ఏమి ఆశించి ఇలా బెదిరిస్తున్నారనేది అంతుపట్టడం లేదు. దోపిడీ దొంగలు, ఎర్రచందనం స్మగ్లర్లు, గంజాయి బ్యాచ్‌ల కింగ్‌పిన్‌లను సైతం విదేశాల నుంచి పట్టుకొచ్చిన మన పోలీసులు... బెదిరింపు మెయిల్స్ అగంతకులను గుర్తించలేకపోతున్నారు. ఇకనైనా పోలీసులు ఈ ఘటనలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, బెదిరింపు మెయిల్స్ పంపుతున్న నిందితులను గుర్తించి.. వారి ఆటకట్టించాలని స్థానికులు కోరుతున్నారు.



రీ నెస్ట్ హోటల్‌లో తనిఖీ చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్లు

ఎన్నాళ్లీ కష్టం

వీల్ ఛైర్లు ఇవ్వరు. స్ట్రెచర్లు ఏమవుతాయో తెలియదు. సిబ్బంది ఉన్నారో లేదో..! కానీ, వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు మాత్రం తిప్పలు తప్పడంలేదు. కాలు దెబ్బతగిలిన వ్యక్తికి ఆదివారం రుయా ఎమర్జెన్సీ వార్డులో వైద్యం అందించారు. ఆ తర్వాత స్కానింగ్ తీసుకు రమ్మన్నారు. దీంతో ఆ రోగి సహాయకుడు ఇలా ఎత్తుకొని స్కానింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఒక్క రోజే కాదు.. రుయాలో తరచూ కనిపించే దృశ్యాలివి. ఇకనైనా అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి సారించి రోగులు, వారి సహాయకుల ఇబ్బందులకు పరిష్కారం చూపాల్సి ఉంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి



23 మద్యం షాపులకు 185 దరఖాస్తులు

- జిల్లాలో గీత కార్మికుల దుకాణాలకు అనూహ్య స్పందన
- నేడు ఎంపిక, కేటాయింపులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికుల మద్యం దుకాణాలకు అనూహ్య స్పందన లభించింది. గతంలో నోటిఫికేషన్ జారీ చేసినా అనుకున్న స్పందన రాక పోవడంతో ప్రభుత్వం మళ్లీ దరఖాస్తు గడువును ఈ నెల 8 వరకు పొడిగించింది. దీంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేసి గీత కార్మికులు ఎక్కడెక్కడ వున్నారు? వారి పరిస్థితి ఏమిటి? దరఖాస్తులు రాకపోవడానికి కారణాలు ఏమిటని ఆరా తీశారు.దీంతో ప్రతి దుకాణానికి రూ.2లక్షలు చెల్లించి తిరిగి రాని డిపాజిట్‌గా ఉండటంతో ఆర్థిక స్థోమత అంతగా లేని వారు ఆసక్తి కనపరచలేదు. గడువు పెంచి అధికారులు తీసుకున్న కొన్ని నిర్ణయాలతో ప్రస్తుతం జిల్లాలోని 23 గీత కార్మికుల మద్యం దుకాణాలకు దాదాపు 185 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో తిరుపతి రూరల్ మండలంలోని ఈడిగ సామాజిక వర్గం నుంచి అత్యధికంగా 30 దరఖాస్తులు వచ్చాయి. ఇక తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఈడిగ సామాజిక వర్గం నుంచి 25, తడ నుంచి 17, ఓజిలి నుంచి 11, వరదయ్యపాలెం మండలం నుంచి 8, శ్రీకాళహస్తి నుంచి 4, వెంకటగిరి నుంచి 5, గూడూరు నుంచి 6, తొట్టంబేడు నుంచి 4, కేవీబీ పురం నుంచి 9, ఎర్రావారిపాలెం 5, డక్కిలి 1, నారాయణవనం నుంచి 5, శ్రీకాళహస్తి రూరల్ నుంచి3, బాలయ్యపల్లి 4దరఖాస్తులు వచ్చా యి. ఇక గౌడ సామాజిక వర్గానికి సంబంధించి పుత్తూరు మున్సిపాలిటీ నుంచి13, నాయుడుపేట మున్సిపాలిటీ9, గౌండ్ల సామాజిక వర్గానికిగాను సూళ్ళూరుపేట నుంచి ఒకటి, పెళ్ళకూరు 3, వాకాడు 2 వచ్చాయి. గౌడ్ సామాజికవర్గంలో చిట్టమూత్తూరు నుంచి 11, నాగలాపురం 5, దొరవారిసత్రం 4 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలించి అర్హత కలిగి, ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలు కేటాయిస్తారని జిల్లా ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు.

ముగిసిన పుస్తక ప్రదర్శన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పది రోజులుగా నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు పలు రాష్ట్రాల నుంచి 70స్టాళ్లు వచ్చాయి. నగరవాసులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచీ పుస్తక అభిమానులు ప్రదర్శనకు వచ్చారు. పుస్తకాలను కొనుగోలు చేశారు.

కష్టపడిన కార్యకర్తలకే పెద్దపీట: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిట్టమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం చిట్టమూరు ప్రభుత్వాస్పత్రిలో అదనపు భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ నిర్ణయాలను ఎవరూ అతిక్రమించకూడదన్నారు. తనతో పాటు ఏ నాయకుడు తప్పు చేసినా కార్యకర్తలు నిలదీయవచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 23 పంచాయతీల్లో కూటమి విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. మండలంలో రూ.3.50 కోట్లతో సిమెంట్ రోడ్ల పనులు చేపట్టామని, అందులో రూ.2కోట్ల పనులు పూర్తి చేశామన్నారు. రూ.39 లక్షలతో చిట్టమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవనం నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేలా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, డీటీ నిరంజన్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు కోటయ్య, వైద్యాధికారిణి పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు దువ్వూరు మస్తాన్‌రెడ్డి, వెదనపర్తి రాజగోపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీపతి బాబు, దువ్వూరు భారతమ్మ, చిన్నారావు, హరికృష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డి, చెంచురామయ్య ఆచారి, కస్తూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



సమావేశంలో సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చెంగయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలను ప్రవేశపెడుతామని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో మున్సిపాలిటీల్లో పనిచేసే ఉద్యోగులందరూ తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



భార్గవికి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నేతలు శంకరయ్య, మురళీరెడ్డి, తిరుపాల్, వీరయ్య తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి భార్గవికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. పెళ్లకూరు మండలం కానూరు రాజుపాలెం బండి మహేష్, మనెమ్మ దంపతుల కుమార్తె భార్గవి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆమెన వెంటనే స్పందించారు. వైద్య ఖర్చులకోసం రూ.10 వేలు చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. టీటీడీ పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో వైద్యం అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, తిరుపాల్, వేనాటి మురళీరెడ్డి, తిరుపాల్, కోటపోలూరు సాగు నీటి సంఘ అధ్యక్షుడు రమణయ్య, సుధాకర్‌రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీలో క్రీడామణిహారం

- సిద్ధమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం
- ఒకే వేదికలో ఐదు క్రీడాంశాలకు అవకాశం



తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో క్రీడోత్సాహం వెల్లివిరియనుంది. వర్సిటీలో మహిళా క్రీడాకారులను మరింత పోత్సాహించేందుకు అధునాతన మైదానం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ప్రశాంత వాతారణంలో మల్టీపర్పస్ స్టేడియం ఏర్పాటుకు ఖేలో ఇండియా కింద కేంద్రం రూ. 4.5కోట్లు మంజూరు చేసింది. వర్సిటీ గ్రాంట్ కమిషన్ ద్వారా మరో రూ.1.25కోట్లు వెచ్చించింది. 2022లో పోలీసు హౌసింగ్ బోర్డు ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించింది. కాస్త ఆలస్యమైనా అధునాతన హంగులతో స్టేడియం రూపుదిద్దుకుంది. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులనూ సమకూర్చింది. ఈ వారంతంలోనే రంగుల పనులను కూడా పూర్తి చేయనున్నాన్నారు. స్టేడియం అందుబాటులో వస్తే ఒకే వేదికలో ఐదు క్రీడాంశాలను నిర్వహించవచ్చు. శాప్‌ చైర్మన్ రవినాయుడు స్టేడియం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఐదు క్రీడాంశాలకు అవకాశం

వర్సిటీ వెనుకభాగంలో సువిశాల ప్రాంగణంలో రెండంతస్తులతో నిర్మించిన స్టేడియంలో ఉడెన్ షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు, యోగా, టేబుల్‌టెన్నిస్, జిమ్‌హాళ్లు వేర్వేరుగా ఉన్నాయి. పురుషులు, మహిళలకు విశ్రాంతి, డ్రెస్సింగ్ గదులతోపాటు లిఫ్టు సదుపాయం కూడా కల్పించారు. ముఖద్వార పైభాగంలో వివిధ ఆటగాళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ముచ్చలగుంట గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై ఆదివారం ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు, రెండు మోటారు సైకిళ్లు, రూ.7800 నగదు స్వాధీన చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

12లోగా రుణాలకు దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోటీశ్వరరావు కోరారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెట్టుబడుల మోత.. దిగుబడుల్లో వాత

- ముంచిన వాతావరణ మార్పులు
- మద్దతు ధర లేక నష్టాల్లో రైతులు



చిల్లకూరులో మిషన్‌తో వరి కోతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నుముకగా పిలుచుకునే రైతుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రకటనల్లో తప్ప ప్రభుత్వం నుంచి మద్దతు లభించడకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. వ్యయప్రయాసలకు ఓర్చి పండించిన వరిలో ఆశించిన మేరకు దిగుబడులు రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం, తెలుగుగంగ జలాలు పుష్కలంగా అందడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. అయితే పంటలు పండిన తరువాత దిగుబడులు తగ్గిపోవడంతో అన్నదాతల ఆశలు నీరుగారిపోయాయి. ముఖ్యంగా వరి పైరు పొట్ట, వెన్ను దశలో కురిసిన అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులతో దిగుబడి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. విత్తనాలు, పురుగుమందులు, కూలీలు ఏటేటా పెరగడంతో పెట్టుబడి పెరిగిపోతూనే ఉంది. ఈ ఏడాది వరి పైరుకు తెగుళ్లు విపరీతంగా సోకడంతో పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సివచ్చింది. గతంలో ఎకరాకు 45 కిలోల నుంచి 50 బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 30నుంచి 35 కిలోలు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

వరి కోతలు ప్రారంభం: మండలంలో 20 రోజుల నుంచి వరి పంట కోతలు జరుగుతున్నాయి. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు ధారపోయాల్సి వస్తోందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048 రకాల 75 కేజీల ఏ గ్రేడ్ ధాన్యం బస్తా రూ.1740, బీ గ్రేడ్‌కు రూ.1720 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించగా, ప్రైవేట్ మార్కెట్‌లో రూ.1550 మాత్రమే పలుకుతోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.





రాజుపాళెం వద్ద జాతీయ రహదారి పక్కన ఆక్రమిత స్థలంలో హోటళ్లు - పాఠశాల పక్కన చదునుచేసిన గ్రామనత్తం భూమి

ఆక్రమణలకు అడ్డేది?

జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామనత్తం, పొరంబోకు భూముల కబ్జా

ఓజిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామనత్తం, రెవెన్యూ, పొరంబోకు భూములు కబ్జాకు గురౌతున్నాయి. ప్రధానంగా రాజుపాళెం వద్ద ఆక్రమణలు ఏళ్లుగా కొనసాగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇక్కడ లారీలు, ఇతర వాహనాలు నిలిపేందుకు అనువుగా ఉండడంతో జాతీయ రహదారికి ఇరువైపులా హోటళ్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో భూముల విలువ పెరగడంతో ఇరువైపులా ప్రభుత్వ, గ్రామనత్తం, పొరంబోకు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇటీవల రోడ్డు పక్కన ఉన్న పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న గ్రామనత్తం భూమిని సైతం చదునుచేసి నిర్మాణానికి సిద్ధం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా విచారించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఆదివారం నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, శేషు, బాలయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, చలమయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


అక్రమ కేసులు పెడితే సహించం: కాకాణి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన వైసీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మంగళపూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు సతీష్‌యాదవ్‌పై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి వేధించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేరిగ మురళీధర్, ఎద్దల నరేంద్రరెడ్డి, గురవయ్య, నాగరాజు, సునీల్‌రెడ్డి, రాధారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి



ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయనను వైసీపీ సీనియర్ నాయకులు అర్జునగారి మురళి, బత్తిని చంద్రశేఖర్, చెంజి సుబ్బరాయులు, చెంచు కుమార్, కోటిరెడ్డి సన్మానించారు.

తుడా క్వార్టర్స్‌లో చోరీ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మంగళం తుడా క్వార్టర్స్‌లో జరిగిన చోరీ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జగన్నాథం వివరాల మేరకు... స్విమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.ఆర్.నరేంద్రబాబు తుడా క్వార్టర్స్‌లోని హౌస్ నెంబరు 81లో నివాసముంటున్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఐదో తేదీ ఉదయం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. చిత్తూరులో చదువుకుంటున్న కుమారుడు రేవంత్ తల్లిని చూసేందుకు శనివారం ఆస్పత్రికి వచ్చాడు. రాత్రి తుడా క్వార్టర్స్‌లోని ఇంటి వద్దకు చేరుకున్నాడు. తలుపులు, బీరువా, ఇతర లాకర్లు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని తండ్రికి విషయం చెప్పాడు. ఆదివారం ఉదయం తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జగన్నాథం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ

డక్కిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవాయపాళెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా విధిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

సిమెంట్ రోడ్ల పనుల పరిశీలన

చిట్టమూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చిట్టమూరులో జరుగుతున్న సిమెంట్ రోడ్ల పనులను టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్సీ కాలనీలోని ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారి జగదీష్, చిట్టమూరు సర్పంచు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు

నాయుడుపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భీష్మ ఏకాదశి పూజలు జరిపారు. మద్దాలి సోమశేఖర్‌రెడి, ఇందిరమ్మ దంపతులు మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడూరు సుధీర్‌రెడ్డి, ప్రధానార్చకుడు బాలాజీస్వామి, కమిటీ సభ్యులు గూడూరు ప్రభావతమ్మ, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్, అంకయ్య, సునీల్‌స్వామి, శిల్పారెడ్డి, సాహిత్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులికాట్ సందర్శించిన రాష్ట్ర వన్యప్రాణి విభాగ ముఖ్య అధికారి



పులికాట్ సరస్సులో బైనా క్యులర్ ద్వారా పక్షులను వీక్షిస్తున్న ఏకే ఖాన్, పక్కన డిప్యూటీ సీఎఫ్ హారిక, రేంజర్ నరసింహారావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సును రాష్ట్ర వన్యప్రాణి విభాగం ముఖ్య అధికారి ఏకే ఖాన్ ఆదివారం సందర్శించారు. ముందుగా ఆయన అటకానితిప్ప వద్దనున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సూళ్లూరుపేట - శ్రీహరికోట మార్గంలో ఉన్న పులికాట్ సరస్సును సందర్శించి పక్షులను వీక్షించారు. ఆయన వెంట డిప్యూటీ సీఎఫ్ హారిక, రేంజర్ నరసింహారావు, సిబ్బంది ఉన్నారు.

ఎఫ్ఆర్‌వోల అసోసియేషన్ తిరుపతి సర్కిల్ అధ్యక్షుడిగా దొరస్వామి

మంగళం, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ క్షేత్రాధికారుల (ఎఫ్ఆర్‌వోలు) అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం తిరుపతి - కరకంబాడి మార్గంలోని బయో ట్రిమ్‌లో నిర్వహించారు. తిరుపతి సర్కిల్ అధ్యక్ష, కోశాధికారి పోస్టులకు ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా దొరస్వామి, కోశాధికారిగా బి.ప్రియాంకను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.లక్ష్మీపతి, తిరుపతి సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు బి.రామానాయక్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



పీహెచ్‌సీలో అదనపు భవన నిర్మాణ భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నేతలు, వైద్యులు, సిబ్బంది

చిల్లకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రూ.39.81 లక్షలతో నిర్మిస్తున్న నూతన భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో రూ.39.81 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించి ల్యాబ్, కంప్యూటర్ గది, స్టోర్‌రూమ్, రిసెప్షన్‌గది, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చిరంజీవి, వెంకటకృష్ణయ్య, పద్మజ, శివకుమార్, మునిశేఖర్‌గౌడ్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

క్రికెట్ అసోసియేషన్‌కు రూ.50వేల విరాళం

చిల్లకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల సీనియర్స్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. మండలంలోని కలవకొండ గ్రామంలో నిర్వహిస్తున్న మండల సీనియర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీనియర్ క్రీడాకారులంతా కలిసి అసోసియేషన్ ఏర్పాటు చేసి క్రికెట్ పోటీలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి కూడా క్రికెట్ అసోసియేషన్‌కు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, చిరంజీవి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఉగ్గుముడి, మంగళంపాడు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొని పొదలను తలపిస్తుండడంతో ఆంధ్రజ్యోతిలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సూళ్లూరపేట రూరల్ ఏఈ పూర్ణిమ ఆదివారం సిబ్బందితో వెళ్లి ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్లను పరిశీలించారు. స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలను తొలగించారు.

'సీపీఆర్ మంగళ' అపార్ట్‌మెంట్ ప్రీ బుకింగ్ ప్రారంభం



సీపీఆర్ అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మంగళం పరిధిలో అధునాతనంగా నిర్మించిన 'సీపీఆర్ మంగళ' 2బీకే అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ఎండీ కేవీ చలపతి ఆదివారం ప్రారంభించారు. కరకంబాడి రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా సీపీఆర్ అపార్టుమెంట్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. ప్రీమియం లోకేషన్, మోడర్న్ డిజైన్, ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, సేఫ్టీ, పార్కింగ్, క్లబ్‌హౌస్, పార్కు, పాఠశాలలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌కు అత్యంత సమీపంలో ఉందని వివరించారు. ఆరంభ ధర రూ.37లక్షలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9492013322/66/88 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్లు కాశీ, లోకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రైవేట్‌కు అప్పగించాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జేఏసీ నాయకులు చినబాబు, జయచంద్ర, నాగవెంకటేష్‌లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని ఆయన నివాసం వద్ద కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీకి సీఎంతో చర్చించాలని కోరారు. నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తాత్కాలిక నియామకాలను ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ ద్వారా నియమించాలని కోరారు.